Please visit www.dhimsa.net




ఏప్రియల్ -2009

వెల రూ.5/-లు

- ➤ భూమికిక్కాస్త చోటివ్వండి
- ➤ విశాఖ గిరిజన తెగల్లో కొన్ని పండగలు ఆచారాలు



కథనం

# ప్రమాదం అంచున చెంచులు..పులులూ !

- గంజివరపు శ్రీనివాస్

నల్లమలలోని నాగార్జున శ్రీశైలం పులుల అభయారణ్యంలో చెంచు తెగ గిరిజ నులదీ.. పులులదీ సారూప్యం ఉన్న సమస్య.పులులతోపాటు అక్కడి చెంచుతెగ గిరిజ నుల మనుగడ కూడా నేడు ప్రమాదం లో పడింది. ప్రభుత్వం, అటవీ యంత్రాంగాల చిత్తశుద్ధి లోపం, మారిన భౌగోళిక, సామాజిక పరిస్థితులు ఇక్కడి అభయారణ్యంలో పులుల సంఖ్య గణనీ యంగా తగ్గిపోవడానికి దోహదం చేసాయి. పులుల సంఖ్య తగ్గిపోవ డానికి అభయా రణ్యంలోనే తరాలుగా బతుకు తున్న చెంచుతెగ గిరిజనులపైనే నెట్టేందుకు అధికార యంత్రాంగం ప్రయత్ని స్తుంది. గిరిజన సంక్షేమ శాఖ తమ బతుకుల్లో మార్పును తీసుకు రాకపోగా పులుల సంరక్షణ పేరుతో తమను బయటికి పంపే ప్రయత్నాలను చెంచు తెగ గిరిజనులు జీర్ణించుకోలేక పోతున్నారు. గడిచిన కొన్నేళ్లుగా నల్లమల ప్రాంతం మావోయిస్టులకు అడ్డాగా మారింది. ఈ పరిస్థితుల్లో నల్లమల పై అటవీశాఖ కంటే పోలీసు లదే పైచేయి అయింది. ఫలితంగా పులుల సంరక్షణకు అటవీ శాఖ చేపట్టిన అనేక కార్యక్రమాలు కాగితాలకే పరిమి తమై పోయాయనే ఆరోపణలున్నాయి. ఇక్కడి పులుల సంఖ్య ఎంతనేది అంతు చిక్కని రీతిలో వుంది.




చెంచుపెంటల్లో సోలార్ వాడకం

అడవిలో పులి వుందంటే అది ఆరోగ్యదాయకమైన అటవీ ప్రాంతం కింద లెక్క. పులిని పర్యావరణ సూచిగా గుర్తిస్తారు. నల్లమల అంటే తమిళంలో మంచి కొండలు అని అర్ధం. ఈ నల్లమల అడవులు పకృతి అందాలకు, జీవ వైవిధ్యానికి ఆలవాలం. ఈ అడవుల్లోని వృక్ష, జంతు జాతులు, వనమూలి కలు, క్రిమి కీటకాలతో పాటు ఇక్కడే నివ సించే ఆదిమ తెగకు చెందిన చెంచు తెగ గిరిజనుల జీవనశైలి, సంస్కృతీ విశిష్టమైనవి. సింహాము, ఏనుగు తప్ప వణ్యప్రాణులైన అన్ని స్తన్యప్రాణులు నల్లమలలో ఉన్నాయి. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన రాయల్ బెంగాల్ పులులకు నల్లమల అడవులు ప్రధాన స్థావరంగా ఖ్యాతి చెందాయి. ఐదుజిల్లాల పరిధి లోని 3568 చ.కి.మీల విస్తీర్ణంలోని నల్లమల అడవులను ప్రత్యేకంగా అభయారణ్యంగా గుర్తించారు అందుకే. ప్రపంచంలో ఎక్కడైనా పులుల సంఖ్య ఆధారంగానే పర్యావరణాన్ని సమతుల్యం చేసే అటవీ ప్రాంతాన్ని గుర్తి స్తారు. అడవిలో పులి లేదంటే వాటికి శాఖాహార వణ్యప్రాణులు అందు బాటు లో లేనట్టే.

పులి కదలికలు, పున రుత్పత్తి, జన నరేటు వంటి అంశాలు అడవిలోని మిగిలిన జంతుజాల జీవన చక్రాన్ని స్పష్టం చేస్తా యి. పులి దాదాపు నలభై చ.కి.మీ.ల పరిధిలోని తిరుగాడు తుంది. జీవావరణ వ్యవస్థకు నష్టం కలిగించ కుండా నష్టం కలిగించే మానవ సమాజానికి దూరం గా ప్రత్యేక అభయారణ్యా లుంటే సదరు జీవవైవిధ్యం దానంతట అదే అభివృద్ధి జరుగు తుందనే ప్రాథమిక సూత్రంతో పులి ఆవాస ప్రాంతాన్ని సంరక్షించాలనే లక్ష్యంగా పెట్టు కున్నారు. శ్రీశైలంలో పులుల సంఖ్య అత్యంత దయనీ యంగా దిగజారిపోవడానికి వేట, పశుగ్రాసం, అడవులు అంతరించి పోవడం, వనసంరక్షణకు నిర్దేశించిన స్థాయిలో సిబ్బంది కరువయ్యారు.నక్సలిజం కారణంగా వారు తమవిధులను మొక్కు బడిగా నిర్వర్తించడం, అభయారణ్యం అంతకంతకూ కుదించుకు పోవడం వంటి విషయాలను ప్రధానంగా చెప్పుకోవచ్చు. మొత్తం అభయా రణాన్ని కోర్ (జన సంచారంలేని ప్రాంతం), బఫర్ (గడ్డి మేసే జంతువులు తిరిగే ప్రదేశం) ఏరియా లుగా విభజించి చెబుతారు. కోర్ ఏరియాలో చెంచు గ్రామాలను మైదాన ప్రాంతాలకు తరలించిమిగతా ప్రాంతాలలో వాళ్ళకి ఆవాసాలు కల్పించి,సంచాం ్ర్రాంతాన్ని (కోర్) మను షుల నుంచి వత్తిడి లేకుండా ఎటువంటి విని యోగం లేని ప్రాంతంగా వదిలేయాలన్నది వన్యప్రాణి సంరక్షణలోని ముఖ్య ఉద్దేశం. ఈ సూత్రం కేవలం కోర్ ఏరియాకే పరిమితంకాక మొత్తం అభయారణ్య అడవి ప్రాంతానికి విస్తరించాలన్నది ఆకాంక్ష. దురదృష్టవ శాత్తూ పులి మనుగడ ప్రాధన్యత, దాని సంరక్షణ వెనుక దాగివున్న లక్ష్యాలు.. ఆశ యం సామాన్యుడికి అర్ధంకాకుండా పోయింది. అర్ధవంతంగా ప్రజల్లోకి తీసు కెళ్లడంలో అటవీ యంత్రాంగం విఫలమైంది. ఇంకా అనేక కారణాలుకూడా శ్రీశైలం అభయా

రణ్యంలో పులుల సంఖ్య దిగ జారడానికి కారణభూతమయ్యాయి. అటవీశాఖ మాత్రం ఇక్కడ పులుల సంఖ్య తగ్గిపోవడానికి అక్కడ నివసించే చెంచులే కారణమన్నట్టుగా వ్యవహరిస్తుంది. వేల సంవత్సరాలుగా అక్కడే బతుకుతున్న చెంచుల వల్ల పులికి ఏనాడూ హాని కలిగిన సందర్భాలు లేవు. బయిటి నుంచి వేట కోసం, గుప్తనిధుల కోసం నల్లమ లలో అడుగుపెట్టిన మైదాన ప్రాంతాల వారిని చాలాసార్లు చెంచులే తరిమికొట్టారు. పులుల సంరక్షణ పేరిట అడవికి దూరం చేసే ప్రయత్నాలను చెంచులు వ్యతిరేకిస్తున్నారు.




## అడవి చిక్కింది..పులుల సంఖ్యా తగ్గింది

నాగార్జున శ్రీశైలం పులుల అభయారణ్యం దేశంలోనే అతిపెద్దపులుల అభయారణ్యం. నల్లమల అటవీ ప్రాంతం పరిధిలోని మహ బూబ్‌నగర్, నల్గొండ, ప్రకాశం, కర్నూలు, గుంటూరు జిల్లాలోని 3568 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో ఈ అభయారణ్యం విస్తరించివుంది. 1978లో ఈ ప్రాంతాలన్ని నాగార్జున శ్రీశైలం వణ్యప్రాణి సంరక్షణ కేంద్రంగా నోటిఫై చేసారు. 1983లో పులుల అభయారణ్యంగా గుర్తించారు. పులుల సంరక్షణ కోసం ఆవాస అభి వృద్ధి కార్యక్రమాలు అటవీశాఖ చేపడుతుంది. అందులో భాగంగా నీటివనరుల సంరక్షణ, వృక్ష సంరక్షణతో పాటు స్థానిక గిరిజనులను అభివృద్ధిబాట పట్టిం చాలనే లక్ష్యం వుంది. 1992లో దీని పేరును రాజీవ్‌గాంధీ పులుల అభయా రణ్యంగా మార్చినా వాడుకలో మాత్రం శ్రీ శైలం పులుల అభయారణ్యంగానే ఎక్కువగా పిలుస్తారు. దేశంలో అతి పెద్ద పులుల అబయారణ్యంగా వున్న ఇక్కడ పులుల సంఖ్య మాత్రం చెప్పుకోదగ్గ స్థాయిలో లేదు. క్రమేణా పులుల సంఖ్య దారుణంగా దిగజారి పోయింది. ఆంధ్ర ప్రదేశ్ అటవీ శాఖ ఏప్రిల్ 2008లో 65 వరకూ పెద్ద పులులు వున్నాయని అంచనా కట్టారు. అశాస్త్రీయరీతిలో, కాలం చెల్లిన పద్దతులతో పులుల పంజా గుర్తుల ఆధారం గా అటవీశాఖ నిర్వహిస్తున్న

# అంతుబట్టని చెంచుల జనాభా లెక్కలు

## అటవీ,ఐటిడిఏల మద్య సమన్వయలోపం

ఎటువంటి అభివృద్ది కార్యక్రమమైనా, చట్టమైనా అమలు చేయాలంటే క్షేత్రస్థాయిలో గణాంకాలు కీలకమైన అవసరం. అభివృద్దికి దూరంగా టైగర్ రిజర్వులో బతుకుతున్న చెంచు జనాభాకు సంభందించి అధికార్ల వద్ద వున్న గణాంకాలు ఎంతటివారికైనా విస్మయం కలిగిస్తాయి. అధికార్ల మద్య సమన్వయలోపాన్ని వెల్లడి స్తాయి. ఈ వ్యాస రచయిత ఐటిడిఏ, అటవీ శాఖ అధికార్లను చెంచపెంటలకు సంభం దించి గ్రామాలు, కుటుంబాలు, జనాభా వివరాలను వేర్వేరు కోరి నపుడు వారిచ్చిన వివరాలు పరస్పర విరుద్దంగా వున్నాయి. గ్రామాల్లో కుటుంబాల వివరాల మద్యనే సమ తూకం లేనపుడు వారు సంయుక్తంగా అటవీసాగు భూములు, వనరుల విని యోగంపై ఇచ్చే లెక్కలు, చేసే సర్వేలపై విస్వనీయత ఏమేరకు వుంటుందో అర్ధం చేసుకోవచ్చు. నాగార్జున- శ్రీశైలం టైగరు రిజర్వు ఫీల్డ్ డైరెక్టర్ ఎ.కె.నాయక్, శ్రీశైలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి మల్లిఖార్జున్‌లు వేర్వేరుగా ధింసా ప్రతినిధికి ఇచ్చిన గ్రామాలు జనాభా వివరాలను బేరీజు వేయడం జరిగింది. టైగర్ రిజర్వు పరిధిలోని కోర్ ఏరియాలోకి వచ్చే గ్రామాల కుటుంబాలు, జనాభా వివరాల మద్య వ్యత్యాసాలను దిగువ పట్టికలో చూడొచ్చు. ఈ 24 గ్రామాలు వున్న ప్రాంతాన్నే పర్యావరణ మంత్రిత్వశాఖ క్రిటికల్ టైగర్ హేబిటేట్ (కీలక పులుల ఆవాస ప్రాంతం)గా ప్రకటించింది. అటవీ హక్కుల గుర్తింపు చట్టం అమలు తర్వాత తొలిదశలో ఈ గ్రామాలను బయటకు తరలించా లనేది అటవీ శాఖ యోచన.

| సం.గ్రామం పేరు | అటవీశాఖ కుటుంబాలు ( జనాభా) | ఐటిడిఏ కుటుంబాలు (జనాభా) |
|---|---|---|
| 1. వటవారపల్లి | 192 (857 ) | 22 (57) |
| 2. పలుట్ల | 288 (1051) | 100 ( 408) |
| 3. చింతల | 117 (466 ) | 143 (520) |
| 4. కుడిచింతలబైలు | 66 (253) | 25 (64) |
| 5. మర్రిపాలెం | 70 (253 ) | 88 (363 ) |
| 6. పెద్ద చెరువు | 104 (194) | 27 (61) |
| 7. దర్గనాల | 24 (77) | 39 (140) |
| 8. గుట్టలచేను | 26 (107) | 40 (163 ) |
| 9. అప్పాపూర్ | 44 (224) | 35 (143 ) |
| 10. తాటిగుండల | 14 (62) | 23 (84 ) |
| 11. పెద్ద దామ | 5 (20 | 14 (62 ) |
| 12. సర్లపల్లి | 72 (221) | 56 (194 ) |
| 13. బూరుగుండల | 15 (60) | 4 (25) |
| 14. బావిపెంట | 10 (38) | 5 (40) |
| 15. నెక్కంటి | 29 (113) | 32 (128) |
| 16. మేడిమల్కల్ | 14 (61) | 11 (53) |
| 17. పన్నాలబైలు | 27 (107) | 25 (83) |
| 18. టిఆర్ చెరువు | 18 (63) | 16 (48) |
| 19. పెదరుట్ల | 10 (43) | 12 (50) |
| 20. బైరాపూర్ | 17(50) | 15 (56) |
| 21. తుమ్మలబైలు | 88 (354) | 84 (352) |
| 22. ఫరాహాబాద్ | 7 (29) | 7 (38) |
| 23. రాంపూర్ | 15 (58) | 14 (55) |
| 24. చిన్నరుట్ల | 49 (159 ) | 49 (155) |
| మొత్తం | 1321 (4920) | 886 (3341) |

పులుల గణన లోపభూయిష్టంగా మారిందనే ఆరోపణలు వున్నాయి. ప్రస్తుతం వున్న విస్తీర్ణంలో 300 పులుల వరకూ సంచరించేందుకు అవకాశం వుండగా నేడు వాటి సంఖ్య 25 నుంచి 30 వరకూ మాత్రమే వుంటాయనే వాదన వుంది. ఇక్కడ పులుల సంఖ్య అంతలా దిగజారిపోవడానికి కారణాలు ఏమిటనే విశ్లేషిస్తే కర్ణుడి చావుకు కారణాలెన్నో అన్న రీతిన వుంది. గడిచిన ఇరవై ఏళ్లుగా అటవీశాఖ చెప్పిన పులుల అంకెలను పరిశీలిస్తే నిజంగా వాటి సంఖ్యపై ఎన్నో అనుమానాలు తలెత్తుతాయి.

భారత ప్రభుత్వ పర్యావరణ మంత్రిత్వశాఖలోని ప్రాజెక్టు టైగర్ నివేదిక-2001 ప్రకారం శ్రీశైలం అభయారణ్యంలో 1989లో 94 పెద్ద పులులు వుండేవి. 1990లో 80, 1991లో 97 వుండగా 1992 లో వాటిసంఖ్య ఏకంగా 24కు పడి పోయింది. మరలా 1993లో పులుల సంఖ్యను 51గా చూపించారు. 1994లో 34, 1995లో 35, 1997లో 39, 1998లో 41, 1999లో 51, 2001లో 58, 2002లో 59, 2003లో 64, 2004లో 74గా వున్న పులుల సంఖ్య నేడు 65 -70 మధ్య ఉన్నట్టు శ్రీశైలం పులుల అభయారణ్యం ఫీల్డ్ డైరెక్టర్ ఎ.కె. నాయక్ వెల్లడించారు. 1992లో 24 మాత్రమే వున్న పులుల సంఖ్య 15 ఏళ్లలో రెండు రెట్లు పెరిగిపోయాయంటే ఎంత అద్భుతం. పులుల సంరక్షణలో ఇక్కడ అవలంబించినన విధానా లనే దేశంలోనే ఒక ఆదర్శంగా తీసుకొని వుండాల్సింది కదా ! వాస్తవ పరిస్థితులు పులు ల సంఖ్య అంతగా పెరిగిపోవడానికి ఏమాత్రందోహద పడేలా లేవు.

అభయారణ్యంలోని ఉత్తర-పడమర ప్రాంతాలలో చెరువులు, కుంటలున్నచోట తీవ్రస్థాయిలో అడవి క్షీణత జరుగుతోంది. అంతేకాక నాగార్జునసాగర్-శ్రీశైలం డ్యాం జంతువుల సంచారానికి అడ్డు కట్టుగా మిగిలింది. అడవి బఫర్ ప్రాంతాలలో జనాభా, గ్రామాలు పెరగడం వల్ల అడవిపై తీవ్ర వత్తిడి పెరిగింది. వ్యవసాయ పనులు లేనికాలంలో అడవిపై




వంటచెరకు, కలపకి ఆధారపడటం పెరిగింది.

అభయారణ్యంపైఅధిక సంఖ్యలో పశుసంపద ఆధారపడివుంది. దీన్ని నియంత్రించడంలో అటవీశాఖ ఘోరం గా విఫలమైంది. 3 లక్షలపై చిలుకు పశు సంపద అభయారణ్యంపైనే ఆధారపడుతుండడంతో వన్యప్రాణులకు, పశుసంపదకు ఘర్షణ వాతావరణం పెరిగిపోయింది. ఈ పశు సంపద అంతా అడవిపై ఆధారపడడం తోశాఖాహార వన్యప్రాణులకు జల, ఆహార వనరుల కొరత తీవ్రమైంది. ఫలితంగా పులులకూ ఆహారం కరువయిందనడంలో సంశయం లేదు. ఈ ప్రాంతం కృష్ణానది పరీవాహక ప్రాంతం కావడం, చుట్టుప్రక్కల జిల్లాలకు నీరు అందకుండా డ్యాం వల్ల దూర ప్రాంతా లకి నీరందడం కారణంగా నల్గొండ, ప్రకాశం జిల్లాల నుంచి నీటి పారుదల కొరకు వత్తిడి పెరుగుతుంది. ఈవిధంగా కొద్దిపాటి అడవీ ప్రాంతాన్ని జలాశయ ప్రాంతాలుగా మార్చే యోచనలు కూడా ప్రారంభమయ్యాయి. కొన్నేళ్ల క్రితం వరకూ ఇక్కడ బయటి నుంచి వచ్చే స్మగ్లర్లు విచ్చలవిడిగా వేట సాగించేవారనే ఆరోపణలున్నాయి. మూడేళ్ల క్రితం సికిందరాబాద్‌లో రెండు పెద్ద పులిచర్మాలను పోలీసు లు సీజ్ చేయగా, దర్యాప్తులో అవి ఇక్కడి అభయారణ్యంలోని పులులను వేటాడే సంపాదించినట్టు తేలింది. గడిచిన దశాబ్ద కాలంలో పులులపై విషప్రయోగం జరిగినట్టు 20 కేసులను అటవీశాఖ గుర్తించింది. ఈ నేపథ్యంలో అటవీశాఖ చెబుతున్న స్థాయిలో పులుల సంఖ్య లేదని శ్రీశైలం ప్రాంతంలో ఎవరిని కదిపినా చెబుతారు.

### నక్సలైట్ల అడ్డాగా శ్రీశైలం.. అటవీశాఖపై పోలీసుల పెత్తనం

దేశంలోనేఅతిపెద్ద అభయారణ్యం అయినా ఇక్కడ వన్యప్రాణి సంరక్షణకు ఆ స్థాయిలో నిధులు, ఇతర వనరులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించేందుకు శ్రద్ద చూపడం లేదు. దేశవ్యాప్తంగా 28 పులుల అభయారణ్యాలు ఉండగా నిధుల కేటాయిపు చూస్తే ప్రాధాన్యతా క్రమంలో శ్రీశైలం18 స్థానంలో ఉండి ఏటా కోటి రూపాయల మేర మాత్రమే విడుదల అవుతున్నాయి. ఇది నిధుల కేటాయింపులో అభయారణ్యాల జాతీ య సగటు కంటే చాలా తక్కువగా వుంది. ఇది చ.కి.మీ. వారీగా చూస్తే జాతీయస్థాయి లో శ్రీశైలం కేటాయింపులు అట్టడుగున వున్నాయి. ఏటా చ.కి.మీ.వన్యప్రాంత అభి వృద్ధికి 50 వేల రూపాయలలోపే కేటాయింపు జరుగుతుంది. ఈ అతిపెద్ద అభయా రణ్యాన్ని సం రక్షించేందుకు సరిపోయినంత సిబ్బంది లేక పోవడం కూడా పెద్ద సమస్యగా పరిణమించింది. సాక్షాత్తూ టైగర్ టాస్క్ ఫోర్సు రిపోర్టు ఈ విషయాన్ని తీవ్రంగా

పరిగణించింది. అభ యారణ్య సంరక్షణకు వివిధ విభాగాలకు చెందిన మొత్తం వెయ్యి మంది వరకూ అటవీ సిబ్బంది అవస రంకాగా 300 వరకూ ఉద్యో గాలు ఏళ్ల తరబడి భర్తీకి నోచుకోలేదు. సగటున ఒక్కో ఫారెస్టు గార్డు 11 చ.కి.మీ.లు, ఫారెస్టు సెక్షన్ అధికారి 52 చ.కి.మీ.లు, రేంజ్ స్థాయి అధికారి 68 చ.కి.మీల విస్తీర్ణానికి కాపు కాయాల్సి వస్తుంది. దేశంలో సమ స్యాత్మ కమైన అభయారణ్యాల్లో శ్రీశైలం కూడా ఒకటి. గడిచిన దశాబ్దకాలం పాటు మావో యిస్టులకు నల్లమల అడవుల్లోని అభయార ణ్యం షెల్టర్ జోన్‌గా మారింది. 2004లో ప్రభు త్వంతో మావోయిస్టుల చర్చలు సాగించిన సమయంలో నల్లమల ప్రాంతం వార్తలకెక్కిన విషయం తెలిసిందే. భద్రతా కారణాల రీత్యా అటవీ సిబ్బంది అభయారణ్యంలో పెట్రో లింగు, సర్వేలు నిర్వహించడం సాధ్యం కాని పని అని సాక్షాత్తూ టైగర్ టాస్క్ ఫోర్స్ కమిటీ యే తమ నివేదికలో పేర్కొనడం విశేషం. మావోయిస్టు కార్యకలాపాలు విస్తృతం కావడం మూలంగా అభయారణ్యంలో అటవీ సిబ్బం ది అడుగు తీసి అడుగేయని పరిస్థితి. నక్సల్స్ కార్యకలాపాలను అడ్డుకట్ట వేసే క్రమంలో అభయారణ్యంపై పోలీసుల పట్టు పెరిగి అటవీ సిబ్బంది పట్టుజారింది.

నక్సల్స్ కారణంగా వైర్‌లెస్, ఇతర అత్యాధునిక సమాచార సాధనాలను వినియోగించవద్దని పోలీసులు సూచిం చడడంతో అటవీశాఖ వాటిని వినియో గించడం మానేసింది.తదుపరి చర్యలేమీ అటవీశాఖ చేపట్టకపోవడంపై 2006లో కాగ్ వార్షిక నివేదికలో తప్పుపట్టింది. పోలీసుల కనుసన్నల్లోనే తాము మసలాల్సిన దృష్ట్యా వణ్యప్రాణి సంరక్షణ ఆశించినస్థాయిలో చేయలేకపోతున్నామని పేరు చెప్పడానికి నిరాకరించిన ఓ ఉన్నతాధికారి వాపోయా రంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పోనీ ఉన్న సిబ్బంది అయినా తాము శక్తి వంచనలేకుండా కృషి చేసేందుకు వారి వయసు సహకరించే పరిస్థితి లేదు. ఇక్కడ పనిచేసే ఫారెస్టు గార్డు లంతా 45 ఏళ్ల పైబడి 50 ఏళ్లలోపు వారే వున్నారు. ఇది అభయారణ్యాల్లో పనిచేసే గార్డుల జాతీయ సగటు వయసుకంటే ఎక్కువ వయసు కావడం గమనార్హం. 2006 లో కంట్రోల్ అండ్ ఆడిట్ జనరల్ (కాగ్) ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో శ్రీశైలం అభయారణ్యం పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పులుల సంఖ్యపై అనేక అనుమానాలను వ్యక్తం చేస్తూ పులుల క్షీణతపై ఆందోళన వ్యక్తం చేసింది. 20 ఏళ్లుగా ఎడతెగకుండా సాగుతున్న ఆక్రమణలపై అటవీయం త్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరి స్తున్నదని దుమ్మెత్తి పోసింది. ఫలితంగా



మాకైతే బ యటకు తరలి పోవడ నాకి యిష్టం లేదు. అధికార్లు కూడా తమ ఇష్టాన్ని కాదని బయటకు తర లించమని చెబుతున్నారు అటవీ చట్టం అమల్లో అచ్చంపేట అటవీ డివిజన్ సభ్యునిగా వున్నాను. ప్రభుత్వం మమల్ని మొండిగా తరలించలేదు. అధికార్లు చెప్పే పది లక్షల నష్టపరిహారం పట్ల నమ్మకం లేదు. ఒకవేళ ఆ స్థాయిలో సొమ్ము మంజూర యినా అది మా చేతికి అందు తాదనే నమ్మకం లేదు. ఒక ఎంపిటిసిగా తరలింపు విషయమై నాకే పూర్తి సమాచారం లేదు. అలాంటిది చెంచు పెంటల్లో సామాన్యులకు ఏం సమాచారం తెలుస్తుంది?

దేశ్యానాయక్

(మండల పరిషత్ సభ్యుడు, వటవారపల్లి)



మా తాత తండ్రుల నుంచీ ఇక్కడే బతుకుతున్నాం. పులి చంపినా ఇక్కడే చస్తాం. బయటకు పోయి మాత్రం బతకలేము. ఇంతకు ముందు మా చెంచోళ్లు అలా బయ టకుపోయి చాలామంది చచ్చి పోయారు. ప్రభుత్వం దయతలచి మాకు మంచి చేస్తే బాగుంటుంది. మాకు అన్ని వసతులు కల్పిస్తే బాగానే బతుకుతాము. మేము ఎప్పుడూ పులులకు హాని తలపెట్టలేదు. అసలు మేము వాటి జోలికే వెళ్లనపుడు వాటిని కాపాడ్డానికి మమ్మల్ని బయటకు పంపడంలో అర్థం లేదు.

తోకల మల్లయ్య

(చెంచుపెంటల పెద్ద, అప్పాపూర్)



మా చుట్టుపక్కల పెంటలన్నిం టినీ పోలీసులు అప్పాపూర్‌కు తరలించారు. ఆర్నెళ్లు చెట్ల కిందే కాపురాలు పెట్టు కున్నాము. కష్టపడి గుడెసెలు వేసుకున్నాం. ప్రభుత్వం ఏ విధంగానూ ఆదుకోలేదు. నా కూతుళ్లు ఇద్దరు రోగాలతో చనిపోయారు. మా బంధువులు చాలామంది చని పోయారు. అప్పాపూర్‌లో వుండలేక మళ్లీ లోపలికి మా పెంటల్లోకి తరలిపోతున్నాం. మేము ఈ అడవిలో తప్ప బయట ఎక్కడా బతకలేం.

తోకల గురవయ్య

(బైరాపూర్ చెరువు)

మనుష్యుల, జంతువుల మధ్య ఘర్షణ వాతావరణం పెరిగిపోతున్నదని తెలిపింది. ఇంకా నిర్వహణ ప్రణాళికలు అధ్వాన్నంగా తయారు చేస్తున్నారని, ఏటా అశాస్త్రీయంగా, పద్దతిలే కుండా సాగుతున్న పులుల గణన మూలం గా పులుల సంఖ్య వాస్తవ విరుద్దంగా వుంటు న్నదని తెగేసి చెప్పింది. ఇన్ని సమస్యలు, వాస్తవాల నేపథ్యంలో ఇక్కడ అటవీశాఖ పులుల లెక్కలపై ఏ మేరకు విశ్వసనీయత వుంటుందో అర్ధం చేసుకోవచ్చు. ప్రస్తుతం అటవీ శాఖ చెబుతున్న పులుల గణాంకాలు వాస్తవ విరుద్దంగా వున్నాయనే విషయంపై పూర్తిస్థాయిలో అధ్యయనం జరపాల్సి వున్నా ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయడంలేదు. ఇన్ని సవాళ్లను అధిగమించేందుకు పక్కా ప్రణాళిక లేకుండా శ్రీశైలం అభయారణ్యాన్ని కీలక వన్యప్రాణి ఆవాసంగా ప్రభుత్వం ప్రక టించింది. సారిస్కా అభయారణ్యం ఉదంతం తరువాత దేశవ్యాప్తంగా పులుల సంరక్షణపై పెద్ద చర్చే సాగింది. ఈ క్రమం లోనే వన్య ప్రాణి సంరక్షణ చట్టానికి 2006లో మార్పులు చేసారు. దేశవ్యాప్తంగా పులుల అభయారణ్యాల్లో ఆవాసాలను తరలించేందుకు చర్యలు చేపట్టారు. శ్రీశైలం ను కూడా కీలక పులుల ఆవాసంగా (క్రిటికల్ టైగర్ హేబిటెట్) గుర్తిస్తూ డిసెంబరు 2007లో భారత పర్యావరణ మంత్రిత్వశాక నోటిఫికేషన్ జారీ చేసింది. నిపుణుల కమిటీ నివేదికలు ఆధారం గా అంత వరకూ 3568 చ.కి.మీ.ల మేర విస్తరించి వున్న అభయారణ్యంలో 2527 కి.మీ.ల విస్తీర్ణాన్ని కీలక పులుల ఆవాసంగా గుర్తించారు. పులుల ఆవాసం నుంచి మిన హాయించిన రమారమి 1000 చ.కి.మీ.ల అభ యారణ్యం అంతా నల్గొండ ప్రాంతంలోనిదే. ఈ ప్రాంతంలో యురేనియం వంటి ఖనిజ తవ్వకాల కోసం ప్రతిపాదించడం మూలంగానే నాటకీయం ఆ ప్రాంతాన్ని తప్పించారనే ఆరోపణలు ఉన్నాయి. కీలకవన్య ప్రాణి ఆవాసంగా గుర్తించిన అభయారణ్యంలోని కోర్ ఏరియాలోని చెంచు తెగ గిరిజనులను మైదాన ప్రాంతాలకు తరలించేందుకు విశ్వప్రయత్నం చేస్తుంది. ఈ ప్రక్రియ కాస్తా చెంచుల మనుగడకు ప్రమాదంగా పరిణమిస్తుంది.

### ప్రమాదంలో చెంచుల మనుగడ

ఏ రంగంలోనైనా, ఏ సామాజిక వర్గమైనా ప్రగతిని విశ్లేషించేందుకు గణాంకాలే దోహదపడతాయనే విషయం జగద్విదితం. నల్లమలలో అసలు ఎన్ని చెంచు కుటుంబాలు నివసిస్తున్నాయనే విషయంలో

## అభయారణ్యాల్లో ప్రజలకు కష్టకాలం

వన్యప్రాణి సంరక్షణలో భాగంగా 1973లో ప్రత్యేకంగా పులుల అభయారణ్యాల కోసం ప్రాజెక్టు టైగర్ పథకాన్ని కేంద్రప్రభుత్వం ప్రారంభించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 28 పులుల అభయారణ్యాలు సుమారు 38వేల చ.కి.మీ.ల్లో విస్తరించివున్నాయి. ప్రాజెక్టు టైగర్ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ప్రభుత్వం చెబుతుంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఈ అభయారణ్యాల్లో 1970లో 1200 వున్న పులుల సంఖ్య 1990 నాటికి 3500 వరకూ పెరిగాయని అంచనా. అయితే 2004 రాజస్థాన్‌లోని సారిస్కా పులుల అభయారణ్యంలో పులులన్నీ కనుమరుగయిపోయాయనే చేదు నిజాన్ని జాతి యావత్తూ జీర్ణించుకోలేకపోయింది. వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ మార్చి 2005లో నిజాన్ని నిగ్గుతేల్చుతూ సారిస్కాలో పులులు కనిపించడంలేదని తమ మధ్యంతర నివేదిక వెల్లడించడంతో పర్యావరణ, వన్యప్రాణి ప్రేమికుల్లో గుబులు మొదలయింది. దీనిపై ప్రధాని మన్మోహన్‌సింగ్ వెనువెంటనే స్పందించి సిబిఐ దర్యాప్తుకు ఆదేశించారు. 2002 నుంచీ పులుల విచ్చలవిడి సాగుతుందని..చివరి ఆరు పులులను 2004లో వేసవి-శీతాకాలాల మధ్య వేటగాళ్లు వధించారని సిబిఐ ఇచ్చిన నివేదిక పర్యావణమంత్రిత్వశాఖ కళ్లు బైర్లు కమ్మేలా చేసింది. చిట్టచివరి పులి అంతరించిపోయే వరకూ యంత్రాంగం ఏమి చేస్తున్నదీ..మిగతా అభయారణ్యాల పరిస్థితి ఏమిటనే ఆలోచన సారిస్కా షాక్‌తో అంతటా మొదలయింది. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా అభయారణ్యాల పరిస్థితిని అంచనా వేసేందుకు సెంటర్ ఫర్ సైన్స్ ఎండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ సునీతా నారాయణ్ నేతృత్వంలో టైగర్ టాస్క్‌ఫోర్సు కమిటీ ఏర్పాటయి సమగ్ర నివేదికను సమర్పించింది. అనంతరం వన్యప్రాణి సంరక్షణ చట్టంలో మార్పులు తీసుకొచ్చి ప్రత్యేకంగా అభయారణ్యాల సంరక్షణకోసం పర్యావరణ మంత్రిత్వశాఖ కింద ప్రత్యేకంగా నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీని ఏర్పాటు చేసారు.తాజాగా 2008లో పులుల గణన ప్రకారం దేశంలోని అభయారణ్యాల్లో పులుల సంఖ్య 1411 కు దిగజారిందని ప్రభుత్వం ఒప్పుకుంది. పులుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో అభయారణ్యాల్లోని కోర్ ఏరియా పరిధిలోని ఆవాసాలను బయటకు తరలించడం ప్రభుత్వానికి అనివార్యం అయింది. దేశవ్యాప్తంగా అభయారణ్యాల్లోని 2 లక్షల కుటుంబాలను తరలించేందుకు నిర్ణయించింది. ఈ తరలింపుకోసం కోర్ ఏరియాలోని ఆవాసాలకు నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ గత ఏడాది ఫిబ్రవరిలో ప్రత్యేక ప్యాకేజిని ప్రకటించింది. కోర్ ఏరియాలో నివసించే ఒక్కో కుటుంబానికి పది లక్షల రూపాయల నగదును నష్ట పరిహారంగా అందించడం లేదా మొత్తం గ్రామానికి మైదాన ప్రాంతాలకు తరలించి నష్టపరిహారం, పునరావాసం కల్పించడం ప్రత్యామ్నాయంగా ప్రకటించింది. అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం అటవీ భూమి ఆక్రమణలు, వనరులపై హక్కులను కల్పిస్తూనే ఈ పునరావాస పథకాన్ని అమలు చేయాలి. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఛైర్మెన్‌గా, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డన్ మెంబర్ సెక్రటరీగా గల రాష్ట్రస్థాయి కమిటీ, జిల్లా కలెక్టర్ ఛైర్మెన్‌గా, అభయారణ్యం ఫీల్డ్ డైరెక్టర్ మెంబర్ సెక్రటరీగా గల కమిటీలు ఈ పథకాన్ని పర్యవేక్షించాలి. ఈ పథకం కోసం గ్రామస్థాయిలో పునరావాస ప్రణాళిక రూపొందించాలి. ఫిబ్రవరి 2008లో ఈ ఉత్తర్వులు జారీ అయినా శ్రీశైలం అభయారణ్యానికి సంభందించి ఇప్పటికీ సమగ్ర ప్రణాళిక రూపకల్పన జరగలేదు. కోర్ ఏరియా పరిధిలోని కుటుంబాలు తమ గ్రామాలను విడిచివెళ్లేందుకు నిరాకరించకపోవడం, అటవీ హక్కుల చట్టం అమలులో కోర్టు వివాదాల మూలంగా ప్రక్రియలో ఎడతెగని జాప్యం జరగుతుంది.



చెంచుల నివసించే గుడెసెలన్నీ ఇలాంటివే !

ప్రభుత్వం వద్దే సరైన గణాంకాలు లేవంటే ఆశ్చర్యమే. అభయారణ్యం పరిధిలో ఎన్ని కుటుంబాలు నివసిస్తున్నాయనే విషయమై ఒక్కో శాఖలో ఒక్కో రకమైన అంకెలుల కనిపిస్తున్నాయి. పర్యావరణ మంత్రిత్వశాఖ నియమించిన టైగర్ టాస్క్‌ఫోర్సు కమిటీ 2005లో సమ ర్పించిన నివేదికల ప్రకారం శ్రీశైలం అభయా రణ్యంపరిధిలో 149 గ్రామాల్లో 8432 కుటుం బాలకు చెందిన 43,978 మంది జనాభా నివసిస్తున్నారు. కోర్ ఏరియా పరిధిలో 24 గ్రామాల్లో 840 కుటుంబాలకు చెందిన 4,200 జనాభా నివసిస్తున్నారు. ఇదే కోర్ ఏరి యాను కీలక వన్యప్రాణి ఆవాసంగా ప్రకటిం చి అక్కడి గిరిజన కుటుంబాలను మైదాన ప్రాంతా లకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ కోర్ ఏరియా పరిధిలో నివసిస్తున్న చెంచు జనాభా గణాంకాల్లో అటవీశాక, ఐటిడిఏల మద్య తీవ్ర వ్యత్యాసం వుంది. 24 గ్రామాల పరిధిలో అటవీశాఖ లెక్కల ప్రకారం 1321 కుటుంబాలకు చెందిన 4920 జనాభా నివసిస్తున్నారు. అదే ఐటిడిఏ లెక్కల ప్రకారం 886 కుటుంబాలకు చెందిన 3341 జనాభా నివసిస్తున్నారు. చెంచుల పట్ల అధికారం యంత్రాంగ వైఖరి, వారి అభివృద్ధి, భవితవ్వంపట్ల అధికార్ల వైఖరి ఏవిధంగా వుందో ఈ గణాంకాలే చెబుతు న్నాయి. వాస్తవానికి అటవీశాఖకోర్ ఏరియా పరధిలో చాలా గ్రామాలను నమోదు చేయడంలేదు..శ్రీశైలం పులుల అభయా రణ్యం లో తరతరాలుగా నివసిస్తున్న చెంచు తెగ గిరిజనులను అక్కడి నుంచి తరలిం చాలనేప్రయత్నం ఏళ్ల తరబడినుంచీవుంది. అయితే ఆ ప్రయత్నాలు రెండేళ్ల క్రితం నుంచి మరింత ఊపందుకున్నాయి. పులుల సంఖ్య తగ్గిపో వడానికి అక్కడ చెంచు ఆవాసాలు వుండడమే ప్రధాన కారణమనే రీతిలో అటవీసిబ్బంది వ్యవహ రించడం మూలంగా ఈ పరిస్థితి ఏర్ప డింది. 1910 ప్రాంతంలో ప్రకాశం, గుంటూ రు జిల్లాల్లోని చెంచుతెగ గిరిజనులకు విద్యాబుద్దులు అలవర్చాలనే లక్ష్యంతో వారిని అభయారణ్య ప్రాంతంనుంచి మైదాన ప్రాంతానికి తరలించారు. మారిన పరిస్థితు లను తట్టుకోలేని చెంచులు ఎంతో మంది అప్పట్లో మరణించారు. 1932-34 కాలంలో కూడా అటవీ రక్షణ పేరుతో కర్నూలు జిల్లాలోని పెచ్చెరువు ప్రాంతవాసులను మైదానానికి తరలించడం మూలంగా వందల సంఖ్య లో చెంచులు మరణించారు.ఈ పరిస్థితుల్లో అప్పటి కర్నూలు జిల్లా డిప్యూటీ కలెక్టర్ చెంచు

## చెంచులను బలవంతంగా తరలించే ఉద్దేశ్యంలేదు

### - తులసీరావు

శ్రీశైలం అభయారణ్యంలోని చెంచు గిరిజనులను బలవంతంగా తరలించే వుద్దేశ్యంలేదని అటవీ శాఖ సహాయ కన్జర్వేటర్ కె.తులసీరావు (శ్రీశైలం) తెలిపారు. చెంచుల వల్ల అడవికి, పులులకు ఎటువంటి హాని లేదని అన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ స్వచ్ఛందంగా తరలిపోతామనే వారికే నష్టపరిహారం లేదా పూర్తిస్థాయి పునరావాసం కల్పించి తరలించడం జరుగుతుందన్నారు. దీర్ఘకాలంగా తులసీరావు శ్రీశైలం అభయారణ్యంలో పనిచేస్తున్నారు. ఎంతో ప్రయాసకు గురై ఆయన పులుల సంరక్షణకోసం 2006 - 16 ప్రణాళిక రూపొందించారు. పులుల అభయారణ్యంకు సంభందించి ఆయన థింసా ప్రతినిధి శ్రీనివాస్‌తో మాట్లాడారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం అమలులో న్యాయపరమైన వివాదాలు తలెత్తడం మూలంగా నేషనల్ కన్జర్వేషన్ అథారిటీ పునరావాస ప్రణాళిక అమలు చేసేందుకు అడ్డంకులు ఏర్పడ్డాయన్నారు. మొదట అటవీ హక్కుల గుర్తింపు ప్రక్రియ పూర్తయితేనే అభయారణ్యంలోని గ్రామాల తరలింపు ప్రణాళిక తయారీ సాధ్యమౌతుందన్నారు. బయట ప్రచారం జరుగుతున్న రీతిలో పులులకు, చెంచులకు సంఘర్షణ లేదన్నారు. చెంచుల వల్ల అభయారణ్యానికి నష్టం లేదన్నారు. తాము పునరావాస ప్రక్రియకు సంభందించి ఎటువంటి ప్రచారం చేయడంలేదని, కేంద్ర ప్రభుత్వ ప్రణాళిక తెలుసుకున్న కొన్ని గ్రామాలు స్వచ్ఛందంగా తరలిపోయేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని వటవారపల్లి, ప్రకాశం జిల్లాలోని నెక్కంటి, ఆలాటం, దద్దనాల వంటి గ్రామాల ప్రజలు ముందుకు వచ్చారన్నారు. అయితే ఈ గ్రామాల్లో చెంచేతర గిరిజనులు, గిరిజనేతరులు ఎక్కువగా వున్నారన్నారు. నల్లమలలో అటవీ సిబ్బంది కంటే పోలీసులు పైచేయి అయిందన్న ఆరోపణలపై ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల కోసం వారు పనిచేసున్నారని, తమ విధులకేమీ ఆటంకం కలగలేదని చెప్పారు. వనరులు తగ్గిపోవడం మూలంగా చెంచుల జీవనం కష్టంగా మారిందని, వారు కూడా బయటకు తరలివచ్చేందుకు తప్పనిసరి పరిస్థితులు నెలకొన్నాయని తులసీరావు అభిప్రాయపడ్డారు.



పోలీసులు బలవంతపు తరలింపునకు సాక్ష్యంగా మిగిలిన గుడెసెలు

లు నివసించేచోటనే పాఠశాలలు, వైద్యశాలలు పెట్టాలని సిఫారసు చేశారు. చెంచులు అడవుల పరిరక్షణకు దోహ దపడుతున్నారనే భావన అప్పటి అధికార్లలో వుండేది. నిజాం పాలకలు 1941-42లో అభయారణ్యంలోని అప్పాపూర్ ప్రాంత చెంచు గ్రామాలను బయటకు తరలించాలనే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అటవీ ప్రాంతాన్ని వీడిన గిరిజనం బయట వాతావరణం, ఇతరసామాజిక పరిస్థితులతో ఇమడలేక పోయారు. దీంతో తరలింపు యత్నాలను విరమించుకుని అధికార్లు అప్పాపూర్ గ్రామంలోవిద్యా, వైద్యం, ఇతర నిత్యావసరాల సదుపాయాలను అందుబాటులో వుంచారు. వాటి నిర్వహణపై కనీస పర్యవేక్షన కొరవడింది. గొంతువాపు, క్షయ, మలేరియా వంటి తీవ్రత చెంచుల్లో అధికంగా వుంది. చెంచుల్లో సంతాన సాఫల్య త తగ్గిపోయి అదివారి జనాభా తగ్గిపోవడానికి కారణమవుతున్నది. చెంచుతెగ జనాభా తగ్గిపోతున్న దృష్ట్యా వాస్తవంగా వారి జనాభా ఎంత వున్నదనే విషయమై ప్రత్యేక దర్యాప్తు జరపాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌నాయక్ డిమాండ్ చేసారు. చెంచుల అభివృద్ధి విషయంలో ఐటిడిఏ ఏళ్లతరబడి జరిపిన నిధుల వ్యయమంతా బూడిదలో పోసిన పన్నీరయినట్టయిందని ఆయన 'ధింసా ప్రతినిది'తో చెప్పారు. చెంచు గ్రామాల్లో వైద్యసేవలు అందుబాటులో లేవు పిహెచ్‌సిలలో వైద్య సిబ్బంది వుండరు. వారపు సంత లలో ఆరోగ్య శిబిరాల పేరిట లక్షల రూపాయల అవినీతి జరుగుతున్నదనే ఆరోపణలు న్నాయి. పాఠశాలల నిర్వహణ సక్రమంగా లేక పోవడంతో వారికి అక్షర జ్ఞానం కరువైంది. ఇంకా చెంచుల వ్యవసాయ భూములు అధిక శాతం ఆక్రమణల పాలయ్యాయి. తమ నేలపైన వున్న హక్కులను గిరిజనేతరులు చేజిక్కించుకున్నా గిరిజన సంక్షేమశాఖ అధికార్లు నిమ్మకు నీరెత్తినట్టే వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు మహబూబ్ నగర్ జిల్లా లోని అమ్రబాద్ మండలానికి చెందిన రుసుల చెరువు చేపలు పట్టుకునే హక్కు చెంచుల దే అయినా దాన్ని గిరిజనురులు అనుభవిస్తున్నారు. చెంచులు ప్రతీఒక్కరూ కుల దైవంగా పూజించే శ్రీశైలం మల్లికార్జున స్వామి, అహోబిళ లక్ష్మీనరసింహ్మ స్వామి దేవాలయాలను వారసత్వ సంపదగా భావిస్తా రు. వారి పూర్వీకులు శ్రీశైలం దేవా లయం అర్చకులుగా ఉన్నట్లు చరిత్రలో ఆధారాలు న్నాయి. కానీ నేడు చెంచులను దేవస్థాన నిర్వహణ మండళ్ళు పట్టించుకో వడంలేదు. ఇటువంటి పరిస్థితులో చెంచుల మనుగడ ప్రశ్నార్ధకం మారింది.

## పోలీసుల బలవంతపు తరలింపుతో చెంచుల బెంబేలు

సాదారణంగా ఒక గ్రామాన్ని ఉన్న చోట నుంచి తరలించాలంటే చాలా పెద్ద తతంగమే ఉంటుంది. రాష్ట్ర, జాతీయ స్థాయి ల్లో పునరావాస విధానమొకటుంది. దానికి చట్ట బద్దత కల్పించేందుకు పార్లమెంటులో బిల్లు కూడా తయారైవుంది. అదే అభయారణ్యాల్లో గ్రామాలను తరలించాలంటే ఆయా గ్రామ ప్రజల ఇష్టం మేరకు అదీ కుటుంబానికి 10 లక్షల రూపాయల వరకూ నష్ట పరిహారాన్ని చెల్లించాలి. దానికి అటవీ, గిరిజన సంక్షేమ శాఖలు భాద్యత వహించాలి. కాని శ్రీశైలం అభయారణ్యంలోగ్రామాల తరలింపునువడేళ్ల క్రితమే పోలీసులు చేపట్టారు. అదీ దౌర్జన్యంగా. అటవీ, గిరిజన సంక్షేమశాఖలది ప్రేక్ష పాత్రే.

మావోయిస్టులకు సహకారం లభిస్తుందనే నెపంతో అభయారణ్యంలోని మహబూ బ్‌నగర్ జిల్లా పరిధిలోకి వచ్చే కోర్ ఏరియా పరిధిలోని మేడిమల్కాల్, సంగడిగుండాల, ఈర్లపెంట, బైరాపూర్ చెరువు, బల్జీరాం పెంట, వేములపాయ వాగు తదితర చెంచు పెంటలకు చెందిన గిరిజనులు ఆయా గ్రామాలను ఖాళీచేసి అప్పాపూర్ వెళ్లిపోవలిసిం దిగా పోలీసులు హుకుం జారీ చేసారు. ఆయా చెంచుపెంటలకు చెందిన 200 పై చిలుకు కుటుంబాలు అప్పాపూర్ శివారుల్లో తలదాచుకునేందుకు వచ్చారు. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో ఆర్నెళ్ల పాటు చెట్ల కిందే కాపురాలు సాగించినట్టు చెంచులు చెప్పారు. నెమ్మదిగా గుడెసెలు వేసుకున్నా ఆహార కొరత, వాతావరణం పడకపోవడం, వ్యాధుల తీవ్రత మూలంగా చాలా కుటుంబాలు మరలా కోర్ ఏరియాలోని దూరప్రాంతాలకు తరలిపోయారు. మరికొన్ని కుటుంబాలు పొట్టచేత్తో పట్టుకుని మైదాన ప్రాంతాలకు తరలిపోయారు. జనవరిలో ఈ వ్యాస రచయిత ఆ ప్రాంతాన్ని సందర్శించినపుడు ఖాళీ గుడెసెలు కనిపించాయి. తోకల గురవయ్యకు చెందినకుటుంబం మాత్రమే అక్కడ వుంది. జ్వరాలతో తన ఇద్దరు కుమార్తెలు చనిపోయినట్టు చెప్పాడు. ఇక్కడ బతకలేక తాము కూడా లోపలి బైరాపూర్ పెంటకు వెళ్లిపోతున్నట్టుచెప్పాడు. దీన్ని బట్టి అనధి కారికంగా కోర్ ఏరియాలో

జరుగు తున్న సంఘటనలు బాహ్య ప్రపంచానికి తెలియని విషయం ఇట్టే స్పష్టమౌతుంది. అభయారణ్యం ప్రాంతంలోని కోర్ ఏరియాలోని చెంచు గిరిజనులకు బయటకు తరలించాలనే ప్రతి పాదనలు తాత్కాలికంగా బ్రేక్ పడినా అవి భవిష్యతులో ఊపందుకునే పరిస్థితి ఉంది. అటవీ హక్కుల చట్టం అమలు తర్వాతే పునరావాసం విషయం ఆలోచిస్తా మని అటవీ శాఖ ధాంబికాలు పలుకుతున్నా అది వాస్తవ రూపం దాల్చడం చాలా కష్టంతో కూడుకున్న పనే. చెంచులు అయిష్టత ప్రదర్శించడం, నక్సల్స్ కార్యకలాపాలు, నల్లమ లపై పోలీసుల పైచేయి సాధించడంవంటి కారణాల మూలం గా చెంచు పెంటల్లో గ్రామ సభల నిర్వహిం చడం అటవీశాఖకు కష్టతరం. అభయారణ్యం పరిధిలోని రోడ్డు మీద వున్న వటవారిపల్లె గ్రామం తప్పితే కోర్ ఏరియా పరిధిలోని మిగతా గ్రామాల్లో తాజా పునరావాస ప్రణాళిక, నష్ట పరిహారం అంశంపై అవగాహన లేదు. వటవారిపల్లె గ్రామంలో గిరిజనేతరులు, లంబాడి గిరిజనులు అధికంగా నివసిస్తు న్నారు. వీరు నష్ట పరిహారం 10 లక్షల మేర వస్తుంది. అదీ 18 ఏళ్లు దాటి వివాహితులు కాకపోయినా ఆ నష్ట పరిహారం ఇచ్చేస్తారనే ప్రచారం జరుగు తుండడంతో వారిలో ఉత్సాహం కనిపిస్తుం ది.వటవారిపల్లి ఎంపిటిసి దేశ్యా నాయక్ గ్రామ తరలింపునకు అయిష్టత ప్రదర్శిస్తుండగా ఆయన సామాజిక వర్గా నికే చెందిన కొంతమంది యువత భారీ నష్ట పరిహారానికి ఆశపడుతున్నారు. అదే గ్రామా నికి చెంచులు మాత్రం మేము అడవి విడిచి వెళ్లలేమని తెగేసి చెబుతున్నారు. ' పెద్దపులి చంపినా సరే ఇక్కడే ఉంటాం సారు ! బయ టికి పోయి ఎక్కడ బతుకుతాం..ఎలా బతు కుతాం..ప్రభుత్వం డబ్బిచ్చినా వాటినేం చేసు కోగలం..వేరే చోటకు పంపించేసే ఇలాంటి అడవి..ఇక్కడ దొరికే దుంపలు అక్కడ దొరకవు కదా ! ' అప్పాపూర్‌కు చెందిన తోకల మల్లయ్య మాటలివి. అభయారణ్యం పరిధి లోని కోర్ ఏరియా పరిధిలోని గ్రామాలకు అప్పాపూరే కేంద్రంగా వుంటుంది. మల్లయ్య అక్కడ



అప్పాపూర్ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

పెద్దగా వ్యవహరిస్తుంటారు. తమల్ని చాలా ఏళ్ల నుంచి బయటకు తరలించేం దుకు ప్రయత్నిస్తున్నారని ఇదీ కూడా అలాంటి ప్రయత్నమే అయి వుంటుందని తాజా ప్రయ త్నాలను తేలిగ్గా కొట్టిపారేసాడు. పరిహారం గురించి చెబుతున్న మాటలను కూడా ఆయ న విశ్వసించలేదు.

## పున: సమీక్ష చాలా అవసరం

శ్రీశైలం అభయారణ్యం పరిధిలో చెంచు పెంటల్లో ఐటిడిఏ నిర్వహిస్తున్న కార్యక్ర మాలు, పులుల పరిరక్షణ, గణాంకాల సేకర ణలో అటవీశాఖ అనుసరి స్తున్న పద్దతు లు, వాస్తవ విషయాలపై ప్రభుత్వం తక్షణం దృష్టి సారించాల్సిన అవసరం వుంది. చెంచు తెగ జనాభా తగ్గుముఖం పడుతున్న విషయం పై పూర్తి స్థాయి అధ్యయనం జరపాలి. కోర్ ఏరియా పరిధిలోను, బఫర్ జోన్ పరిధి లోనూ వున్న వాస్తవంగా వున్న గ్రామాలు, కుటుం బాలు, వారికి ప్రభుత్వం పరంగా అందుతున్న సేవలు వంటి విషయా లను సమీక్షించాలి. ఇవేమీ పరిగణనలోకి తీసుకోకుండా అభయారణ్యంలో గ్రామాల తరలింపు భాద్యతను స్థానిక అటవీ, గిరిజనసంక్షేమ శాఖలపై పెడితే చెంచులకు మరింత అన్యాయం జరగడంతోపాటు అక్కడ వన్యప్రాణి విషయం లో ఎప్పటికీ అంతుబట్టని గణాం కాలపైనే ఆధారపడి వుండాల్సి వస్తుంది.

భవిష్యత్‌లో శ్రీశైలం అభయారణ్యం మరో సారిస్కాలాంటి చేదు నిజాన్ని అందరికీ పంచకుండా వుండాలంటే ప్రభుత్వం ఇక్కడ అన్నికోణా ల్లో సూక్ష్మస్థాయి పరిశీలన చేయాల్సిన అవసరం ఎంతైనా వుందని స్థానికులతోపాటు ప్రజాసంఘాలు ,ప్రజాస్వామికవాదులు, స్వచ్ఛంద సంస్థలు, పాత్రికేయులు కోరుతున్నారు.

**( The author has published the article under support of Centre for Scince Environment, New Delhi Media fellowship titled - The anotomy of Discord : Human Vs Wild Life in India's Forests )**

**థింసా**

**సంవత్సర చందా**

**కేవలం రూ.50/-లే వెంటనే**

**మనియార్డర్ చేయండి...**

**-: చిరునామా :-**

**థింసా కార్యాలయం**

డోర్ నెం: 10-123, ఫ్లాట్ నెం: 154,

విశాలాక్షీ నగర్, విశాఖపట్నం-43

ఫ్యాక్స్ నెం: 0891 2737662

సెల్ నెం: 97053 47489